సూర్య
నేటి దినపత్రిక
17వ
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం,23 మార్చి 2024



# సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి రాజకీయ నాయకులు సహకరించాలి

## - రాజకీయ పార్టీ నాయకులతో అదనపు ఎస్పీ రాహుల్ మీనా సమావేశం



**చింతూరు,మేజర్‌న్యూస్ :** చింతూరు పోలీస్ స్టేషన్లో శుక్రవారం రాష్ట్రంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని అదనపు ఎస్పీ, చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని వైసీపీ, టీడీపీ, భాజపా, సీపీఎం, సీపీఐలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులను ఉద్దేశించి అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీలో ఎన్నికల నియామవళిని అన్ని పార్టీల నాయకులు తప్పనిసరిగా పాటించాలన్నారు. పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు మూడు రోజుల ముందుగానే స్థానిక పోలీస్ స్టేషన్లలో అనుమతులు తీసుకోవాలని సూచించారు. లౌడ్ స్పీకర్లు వాడే సమయంలో సౌండ్ తక్కువగా పెట్టుకోవాలన్నారు. ప్రచార కార్యక్రమాలు ఏమైనా ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీల నాయకులు జాగ్రత్తలు తీసుకోవాలని, అల్లర్లు, గొడవలు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీల ప్రచారం సందర్భంగా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో చింతూరు సీఐ గజేంద్ర కుమార్, ఎస్సై శ్రీనివాస్ రావు, మోతుగూడెం ఎస్సై గోపాలరావు, పోలీస్ సిబ్బంది, నాలుగు మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## సత్యదేవుని దేవస్థానంలో...

# ఈఓ సంతకం ట్యాపరింగ్ ?




ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం
వ్రత పురోహిత ముసుగులో కొందరు నేరగాళ్ల దొంగాట
అక్రమంగా ప్రమోషన్ పొందటం కోసం
ట్యాపరింగ్ చేసినట్టు సమాచారం
విచారణాధికారి నివేదిక గాలికి..!
దేవస్థానంలో సంబంధిత ఫైల్ మాయం ?
తాజాగా లక్షలాది రూపాయలు లంచాలు మింగి నేరగాళ్లకి
పదోన్నతులు ఇచ్చిన అధికారులు..
ఎండోమెంట్ కమీషనర్ , ఈఓలు నేరగాళ్లపై
క్రిమినల్ కేసులు పెట్టాలని భక్తుల కోరిక..
సూర్య బ్యూరో అందించిన సంచలన కధనం

అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థాన వ్రత విభాగంలో వ్రత పురోహితులకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్స్ ఇవ్వడం జరుపుతున్నారు.అయితే సీనియారిటీ లేని కొందరు వ్రత పురోహితులు అప్పటి ..ఇప్పటి ఈఓ రామచంద్ర మోహన్ సంతకాన్ని ట్యాంపరింగ్ చేసారు.అయితే వీరు దొరికిపోయారు.అక్రమాలకు పాల్పడినట్లు ధృవీకరించి విచారణాధికారిని సైతం నియమించారు.సదరు విషయం కోర్టులో ఉంది.. విచారణాధికారి నివేదిక ఇవ్వలేదు..అయితే ఈఓ సంతకాన్ని ట్యాంపరింగ్ చేసిన వ్రతపురోహిత నేరగాళ్ల నుంచి నుంచి లక్షలాది రూపాయలు తీసుకుని పదోన్నతులు ఇచ్చేసారట.అలాగే సంబంధిత నేరస్తుల ఫైల్ సైతం కనిపించకుండా చేసేసారట..డబ్బులు కక్కుర్తి పడే అవినీతి ఉద్యోగుల వలన ఆ సత్యదేవుని ప్రతిష్టకు భంగం ఏర్పడుతుంది...ఈఓ రామచంద్ర మోహన్ తనదైన శైలిలో నేరగాళ్ల బరతం పట్టాలని భక్తులు కోరుతుండడంతో సూర్య బ్యూరో అందించిన క్షేత్ర స్థాయి లో పరిశీలనాత్మక కధనం...

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఈఓ సంతకం ట్యాపరింగ్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవస్థానంలో వ్రత విభాగంలో వ్రత పురోహితులకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ లు జరుపుతారు. మూడవ తరగతి నుండి రెండవ తరగతి ప్రమోషన్ పొందటం కోసం కొంతమంది పురోహితులు గతంలో ఒక జాబితా తయారుచేసి దానిమీద అప్పటిఈఓ ప్రస్తుత ఈఓ రామచంద్రమోహన్ సంతకం ట్యాపరింగ్ చేసి ఇచ్చినట్టు సమాచారం. ఆ జాబితాపై వ్రత విభాగ అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేసిఈఓసంతకం ట్యాపరింగ్ చేసి అక్రమంగాపదోన్నతులుపొందుటకు చూసినట్టు ధృవీకరించుకుని వారి విజ్ఞప్తిని తిరస్కరించారు.పురోహితులుఈజాబితాపై పదోన్నతులు చేసేలా ఆదేశాలివ్వాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి రిట్ పిటిషన్ నెంబర్ : 14043/ 2020 దాఖలు చేయడం జరిగింది. ఈకేసులో దేవస్థానం తరపున కౌంటర్ దాఖలు చేయడం జరిగింది.

ఈ కౌంటర్‌లోపిటిషన్ దారులు దేవస్థానానికి సమర్పించిన జాబితాలో అప్పటి ఈఓ రామచంద్రమోహన్ సంతకం వేరే ఆఫీసు ఫైల్‌లో సంతకం ఈ జాబితాలో ట్యాపరింగ్ చేసి అక్రమంగా పదోన్నతులు పొందాలని చూశారని, దీనిపై విచారణాధికారిని నియమించి విచారణ చేస్తున్నామని ,విచారణ అధికారి నివేదిక ప్రకారం క్రమ



దిగువ కోర్టు వివరాలు

ప్రార్థన

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం 3వ ప్రతివాది జారీ చేసిన ప్రొసీడింగ్స్ Rc No J1/19/2019 తేదీ 18 07 2019 ప్రకారం మాండమస్ రిట్ స్వభావంపై మరింత రిట్ ఆర్డర్ లేదా ఆదేశాలను జారీ చేసినందుకు సంతోషిస్తున్నాను WP No 18392/ 18392లో 2వ ప్రతివాది ద్వారా ప్రొసీడింగ్స్ A/5926/2009 తేదీ 20 04 2012 సంచికలో జారీ చేయబడిన మార్గదర్శకాలకు విరుద్ధంగా గ్రేడ్ II వ్రత పురోహితుల పదవికి ఇప్పటికే లేని అసోసియేషన్ సభ్యుల ద్వారా 30 మంది బాధ్యతలు ఉన్నవారిని ప్రమోట్ చేయడం 2016 మరియు 29 07 2020 నాటి పర్యవసాన ప్రక్రియలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 16 మరియు 21 లను ఉల్లంఘించే ఏకపక్ష చట్టవిరుద్ధమైన వివక్షతతో కూడిన దుష్ప్రవర్తన వంటి ప్రమోషన్ ప్రయోజనాలను పిటిషనర్లకు అందించకుండా కమ్యూనికేట్ చేయడం లేదు మరియు దానిని పక్కన పెట్టి ఆమోదించడం

పిటిషనర్(లు)

| స.నెం | పిటిషనర్(ఎస్) పేరు |
| --- | --- |



శిక్షణా చర్యలు తీసు కుంటామని రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానానికి తెలపడం జరిగింది.సుమారు 4 సంవత్సరాలు గడుస్తు న్నా విచారణ ఏమైందో సత్యదేవునికే ఎరుక , అసలు విచారణ చేసారా లేదా విచారణఅధికారిఏ నివేదిక సమర్పించారో కూడా చూడకుండా ఈ ట్యాపరింగ్ చేసిన పురోహితులకు కేసు పెండింగ్ లో ఉండగానే పదోన్నతులు కూడా చేయడం జరిగింది. ఇంత జరిగినా కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకోకుండా కోర్టు కేసు పెండింగ్ లో ఉండగా ఏ విధంగా పదోన్నతులు ఇచ్చారో విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.అసలు దేవస్థానం వ్రత విభాగంలోఈకేసుకు సంబంధించిన ఫైల్ మటుమాయం చేసినట్టు సమాచారం. ప్రభుత్వ అధికారి అయిన ఈఓ సంతకం ట్యాపరింగ్ చేసినా కూడా చర్యలు తీసుకోవడం లేదంటే దేవస్థానంలో అవినీతి ఏమేరకు పెరుకుపో యిందో అర్థమవుతోంది. ఈఓ రామచంద్రమోహన్ సంతకాన్ని ట్యాపరింగ్ చేసిన ఫైల్‌క్షుణ్ణంగా పరిశీలించి కోర్టుకు తెలిపిన ప్రకారం తప్పు చేసిన పురోహితులపై ఈఓ క్రమశిక్షణాచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాల డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నెక్సస్- 2024

-ఆధునిక సాంకేతిక రంగంలో డేటా సైన్స్
-కోర్స్ దే హవా -జి రాంబాబు, గ్రాఫిక్స్ ఐటీ సొల్యూషన్స్ డైరెక్టర్



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలోనెక్సస్-2024సైన్స్‌ఫెస్ట్‌ఘనంగా నిర్వహించి నట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక రంగంలో నూతన అంశాలను తెలియజేసేందుకు ఆదిత్య డిగ్రీ కళాశాలలో నెక్సస్- 2024 సైన్స్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ నూతన పరిజ్ఞానాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని, నేడు ఏఐ టెక్నాలజీ, డేటా సైన్స్ మరియు మిషన్ లెర్నింగ్ టెక్నాలజీలపై విద్యార్థులు దృష్టి సారించాలని తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, విధమైన సదస్సులు విద్యార్థుల సాంకేతి పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి, భావ వినిమయానికి దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన విశాఖపట్నంకి చెందిన గ్రాఫిక్స్ సొల్యూషన్స్ డైరెక్టర్ జి రాంబాబు మాట్లాడుతూడేటా సైన్స్ ప్రాధాన్యత తెలిపారు. విద్యార్థులకు డేటా క్లీనింగ్, క్వాలిటీ ఆఫ్‌డేటా, డేటా మేనేజ్మెంట్ వంటి అంశాలను వివరించారు. ఆధునిక సాంకేతిక రంగంలో డేటా సైన్స్ విద్యార్థులదే హవా అని అన్నారు.డేటా సైన్స్‌కోర్స్ ద్వారా అత్యధిక ప్యాకేజీ పొందే ఉద్యోగాలను వివరించారు. విద్యార్థులు రూపొందించిన న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరించారు.అనంతరం డేటా సైన్స్ విద్యార్థులకు గ్రాఫిక్స్ సొల్యూషన్స్ అకడమిక్ హెడ్ సంతోష్ మహపాత్రో ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సదస్సుకు 12 కళాశాలల నుండి విచ్చేసిన విద్యార్థులకు పై హ్యాక్తాన్, బ్రెయిన్ బ్యాటిల్, విజువలైజ్ 360, స్లయిడ్ స్పెక్టకల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలను మరియు ప్రశంసా పత్రాలను అందించారు.ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా లీడ్ ఇండియా సభ్యులు రంజిత్, శ్రీరామ్ లు విచ్చేసి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అంశాలను వివరించారు. ఈకార్యక్రమాన్ని నిర్వహించిన డేటా సైన్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జి మూర్తి, డేటా సైన్స్ విభాగాధిపతి జి విజయలక్ష్మి, ఐ రాజేష్ కుమార్, పృధ్వి తదితర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం

- ఎన్నికల నియమావళిపై పిపిటి ప్రదర్శన
- ప్రచార సమయంలో అనుమతులు తప్పనిసరి
- సువిధా యాప్ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి
- ఆర్వో చైత్ర వర్షిణి



**రాజానగరం/రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికలు-2024 నేపథ్యంలో మార్చి 16వ తేదీ నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోనికి వచ్చినట్లు49-రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఏచైత్ర వర్షిణి తెలియ చేశారు.శుక్రవారంరాజానగరంఅసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారివారిఆధ్వర్యంలో,రాజకీయపార్టీ ప్రతినిధు లకు శిక్షణా కార్యక్రమం స్థానిక రాజమండ్రీ ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఆర్వో ఏ. చైత్ర వర్షిణి మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల ప్రచారం నిమిత్తం తీసుకోవలసిన అనుమతులు, నామినేషన్ కొరకు సమర్పించవలసిన డాక్యుమెంట్లు విషయంలో ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్, పోలింగ్ ఏజంట్ల యొక్క విధులు, బాధ్యతలు , పోస్టల్ బ్యాలెట్, హొమ్ ఓటింగ్, బ్యాలెట్ యూనిట్ల వినియోగం పై సమగ్ర సమాచారం అందచేశారు. అభ్యర్థులు చేసే ఎన్నికల ఖర్చు వ్యయ విధానములు, అనుబంధ రిజిస్టర్ల నిర్వహణ పై సమగ్ర సమాచారం అందచేశారు. వాటి నిర్వహణా తీరు, ఆడిటింగ్ చేయడం ఏ విధంగా ఉండాలి అను అంశములపై, అవగాహన కల్పించడం జరిగింది. ప్రచారం నిమిత్తం సువిధా యాప్ ద్వారా ఆన్లైన్‌లో ధరకాస్తు చేసుకుని,సంభందితపత్రాలుఆర్వో కార్యాలయం లో అందచెయ్యలని కోరారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల యొక్క సందేహాలను నివృత్తి చేయడమైనదని చైత్ర వర్షిణి తెలియ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.సదరు శిక్షణా కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్, సి.పి.ఐ., సి.పి.ఎం., వై. ఎస్. ఆర్. కాంగ్రెస్, తెలుగుదేశం మరియు జనసేన పార్టీల ప్రతినిధులు హాజరైపై విషయాలపై అవగాహన పొందుటయే గాక, వారి సందేహాలను అడిగి తెలుసుకున్నారు.

## కెనాల్‌పై అనధికార వంతెనల నిర్మాణం తగునా

- సిటీలో సంతచెరువు..రూరల్‌లో సామర్లకోట కాలువకబ్జా - పౌర సంక్షేమ సంఘం



**కాకినాడ/సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట జాతీయ రహదారి కెనాల్‌పై అనధికారికంగా రోజుల వ్యవధిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బ్రిడ్జీలునిర్మించడం జరుగుతున్నదని జిల్లా యంత్రాంగం తెలియనట్టు దృతరాష్ట్ర చందం కావడం దురదృష్టకరమని పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. 2005లో అనుమతులు లేకుండానే సిమెంటు తూరలు వేయగా నాలుగు ప్రాంతాల్లో సిమెంటు తూరల మార్గాలు ఏర్పాటు అయ్యాయని అదే త్రోవలో మేడలైన్ అక్రమ వంతెన ఏర్పడిందన్నారు. ఇప్పుడు సిమెంటు తూరల స్థానంలో స్తంభాలు నిలిపి బ్రిడ్జిలు నిర్మించడం వరకు వచ్చిందన్నారు. కాకినాడ సిటీలో కార్పొరేషన్ ఆస్తిగా వున్న సినిమా రోడ్‌లోని సంతచెరువు కార్నర్ ను రెండు వేల గజాల స్థలాన్ని ఆక్రమించి దేవాదాయ శాఖ పరిధిలో వున్న అక్కడి పూర్వ ఆలయం తీసివేసి కొత్తగా కనకదుర్గ ఆలయాన్ని నిర్మించి మరిన్ని షాపులను నెలకొల్పి అమ్ముకున్న మాఫియా దుస్తితి ఏర్పడగా కాకినాడ రూరల్‌లో సామర్లకోట కెనాల్‌పై నీటి పారుదలశాఖ జాతీయ జలవనరులశాఖ అనుమతులు లేకుండా రోజుల వ్యవధిలోఆధునికసాంకేతిక టెక్నాలజీ వినియోగించి అనధికారకంగా బ్రిడ్జిలు నిర్మించడం ఎవరి ప్రమేయంతో జరుగుతున్నదని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ప్రశ్నించారు. ప్రభుత్వం వున్నట్టా? లేనట్టా? అధికారులు రాజ్యాంగ విధిగా చట్టం అనుమతితో నిర్వహణ చేస్తున్నారాలేదాఅన్నది కాకినాడ సిటీ రూరల్ ప్రాంతాల్లోతీవ్రఅయోమయంగా తయారయ్యిందన్నారు. కెనాల్‌పై ఇటువంటి వంతెనలు పది వరకు నిర్మాణం చేపడుతున్న దుస్తితి వుందన్నారు. బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రయివేటు నిర్మాణం చేయడం వ్యాపార ప్రయోజనాల కోసం జరుగుతున్న చర్యలుగా పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత అధికారులు విచారణ చేయాల్సిన అవసరం వుందన్నారు. రానున్న రోజుల్లో ఎగువ నుండి వచ్చే వరదలకు సిటీ డివిజన్లు, రూరల్ గ్రామాలు మరింత ముంపులో శాశ్వతంగా మునిగే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

# దూకుడు

- ప్రచారపర్వంలో ద్వితీయ శ్రేణి సిద్ధం
- అభ్యర్థుల ప్రకటనతో కాస్త ఊరడింపు
- కాకినాడ జిల్లాలో జోరందుకున్న ఉమ్మడి పార్టీల ప్రచారం





అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రావడంతో ఉమ్మడి జిల్లా పసుపు,ఎరుపు,కాషాయం శ్రేణులు సంబరాల్లో మునిగితేలుతున్నాయి. ఇక నియోజక వర్గాలకు ఖరారైన నేతలు ప్రచారపర్వానికి శ్రీకారం చుట్టారు. సీట్లు ప్రకటించిన అభ్యర్థులు ముందుగా అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఒకటి రెండు నియోజకవర్గాలు మినహా ఊహించిన వారందరికీ టిక్కెట్లు రావడంతో ఎన్నికల్లో విజయంపై వ్యూహరచనలో ముందుకు పోతున్నారు. కాకినాడ రూరల్, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, తుని ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. అన్ని మండలాల్లోజోరుగా ప్రచారం సాగిస్తున్నారు. ప్రత్యర్థులను చిత్తు చేయడానికి శ్రమిస్తున్నారు. ప్రజల్లో వీరికి వస్తున్న స్పందన అంతా ఇంతా కాదు...అయితే ప్రత్యర్ధి వైఎస్సార్ పార్టీ చేస్తున్న ఖర్చులకు వీరు హడలిపోతున్నారు. నోట్ల కట్టలు తెగిపోతున్నాయి..

సూర్య బ్యూరో ఉమ్మడి గోదావరి జిల్లాలు :

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తెదేపా, జనసేన, భాజపా కూటమి అభ్యర్థుల విషయంలో స్పష్టత వచ్చింది. 7 స్థానాల్లో కాకినాడ మాజీ ఎమ్మెల్యే కొండబాబు వనమాడి (బిసి),కాకినాడ రూరల్ జనసేన పంతం నానాజీ (కాపు), పిఠాపురం జిల్లా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ (ఓసి), పెద్దాపురం తెదేపా సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప (ఓసి), జగ్గంపేట తెదేపా అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ (ఓసి), ప్రత్తిపాడు తెదేపా అభ్యర్థిగా స్వర్గీయ వరుపుల రాజా సతీమణి వరుపుల సత్యప్రభ (ఓసి), తుని తెదేపా అభ్యర్థిని యనమల దివ్య (బిసి), కాకినాడ ఎంపి అభ్యర్థిగా జనసేన ఉదయ్ శ్రీనివాస్‌లు నియమించబడ్డారు. వీరంతా ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. అన్ని నియోజకవర్గాల్లో వీరికి మంచి స్పందన లభిస్తోంది... రోజురోజుకి సైకిల్, గాజు గ్లాస్ జోరు పెరుగుతోంది. కాకినాడ రూరల్‌లో వరుస వలసలతో తన మార్క్ రాజకీయాన్న పంతం నానాజీ చూపిస్తున్నారని చెబుతున్నారు. అదేవిధంగా జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. తెదేపాలో వెల్లువలా చేరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఉమ్మడి పార్టీలకు ఆదరణ ప్రజల్లో పెరిగిపోతోంది. దూకుడు ఆపడం ఎవరివల్లా అయ్యేలా లేదు...



## ఈ నెల 28న ఉమ్మడి తూర్పుగోదావరి
## జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ స్థాయి సంఘాలు 1 నుండి 7 వరకు సమావేశం ఈనెల 28 వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి నిర్వహించడం జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో ఏ.శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం లోని నిబంధనలకు లోబడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘల సమావేశములు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన నియమావళికి లోబడి ది.28.03.2024వ తేదీ గురువారం ఉదయం 10.30 గం.నుండి నిర్వహించనున్నమని జిల్లా పరిషత్ సిఈఒ తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని సిఈవో అ ప్రకటనలో కోరారు.

## మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**అల్లవరం, మేజర్ న్యూస్ :** స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ అధ్యక్షతన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ సక్రమ అమలులో అందరు అధికారులు సహకరించాలని, వారి శాఖల కార్యాలయంలో ఎటువంటి కోడ్ ఉల్లంఘన జరగకుండా తరచూ పరిశీలించాలని తెలిపారు. తహశీల్దార్ సునీల్ కుమార్ మాట్లాడుతూ స్కూల్స్‌లో, అంగన్వాడిలలో స్టూడెంట్స్ ఇస్తున్న ఫుడ్‌పై ఎటువంటి గుర్తులు ఉండరాదన్నరు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్, తహశీల్దార్ సునీల్ కుమార్, ఎంఈఓ కిరణ్ బాబు, ఎంఈఓ-2 ఏడుకొండలు, ఏఈ సంపన్న, ఏపిఓ శ్రీను బాబు, ఏపిఎం సయీద్, ఇతరులు పాల్గొన్నారు.

# హెూరాహెూరీకి రెడీ

- కాకినాడ జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక పూర్తి
- వైఎస్ఆర్ పార్టీలో బిసిలకు దక్కని చోటు.. ముగ్గురు సిట్టింగులకు దక్కని సీట్లు
- ఐదు స్థానాల్లో టిడిపి - రెండు స్థానాల్లో జనసేన
- బిజెపికి జిల్లాలో నో ఛాన్స్ - నడుమ కాంగ్రేస్ రాకే ఆలస్యం
- పిఠాపురం, కాకినాడ రాజకీయం రసవత్తరం



సార్వత్రిక ఎన్నికల సమర భేరి మోగింది..సమరోత్సాహంతో పార్టీలు ఎన్నికల రణ క్షేత్రంలోకి అడుగు పెట్టబోతున్నాయి.. అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమంటున్నాయి.. ప్రత్యర్థిని పడగొట్టేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి..విజయమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నాయి...నాయకులు, కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నాయి..ప్రత్యర్థి పార్టీ అభ్యర్థిని దెబ్బతీసేందుకు ఉన్న ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకూడదని శ్రేణులకు దిశనిర్ధేశం చేస్తున్నాయి. అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి.. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తుంటే.. గత పాలనకు, ప్రస్తుతం జరుగుతున్న పాలనకు తేడాలు చెబుతూ.. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని, నిరుపేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మరోమారు అధికారమిస్తే చేపట్టబోయే పనుల గురించి చెబుతూ, విపక్షాలను ఎండగడుతూ అధికారపార్టీ నాయకులు విస్తృతంగా ప్రజల్లోకి వెళుతున్నారు. ఈసారి ప్రభుత్వాన్ని పడగోడతామంటూ, మూడు పార్టీలు ఏకమై జబ్బలు చరుస్తుంటే...ఎంత మంది వచ్చినా.. తాము ధీమాగా ఎన్నికల బరిలోకి దిగుతుండటం వైఎస్ఆర్ పార్టీ విశేషం... మొత్తానికి హెూరాహెూరీ పోరుకి రెడీ అయ్యారు...

**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** కాకినాడ జిల్లాలో ఒక ఎంపి, ఏడు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రధాన పార్టీలు పూర్తిచేసాయి. భారతీయ జనతా పార్టీ కూటమిలో 10 స్థానాలు తీసుకున్నప్పటికీ కాకినాడ జిల్లాలో ఒక్క స్థానం కూడా పోటీలో లేదు. అదేవిధంగా జనసేన ఈ జిల్లాకు సంబంధించి కాకినాడ ఎంపి, కాకినాడ రూరల్, పిఠాపురం లకు మాత్రమే పరిమితమైంది.కాకినాడ సిటీ నుంచి తెలుగుదేశం, జనసేన, బిజెపి తరపున మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి లు పోటీ పడుతున్నారు. కాకినాడ రూరల్ నుంచి మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా పంతం నానాజీ, వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పోటీ పడుతున్నారు. పిఠాపురం నుంచి మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్, వైసీపీ అభ్యర్థిగా కాకినాడ ఎంపీ వంగా గీతా పోటీలో ఉన్నారు. తుని అసెంబ్లీ నుంచి కూటమి అభ్యర్థిగా యనమల దివ్య, వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి దాడిశెట్టి రాజా పోటీ చేస్తున్నారు. పెద్దాపురం నుంచి కూటమి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైసీపీ నుంచి దవులూరి దొరబాబు పోటీ చేస్తున్నారు. ప్రత్తిపాడు నుంచి ఉమ్మడి అభ్యర్థిగా వరుపుల సత్యప్రభ, వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే వరుకుల సుబ్బారావులు పోటీపడుతున్నారు. ఇక జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉండగా వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ తోట నరసింహం పోటీ పడుతున్నారు. దీంతో కాకినాడ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులు ఖరారు అయ్యారు... అయితే వైఎస్ఆర్ పార్టీ ఒక్క స్థానంలో కూడా బిసిలకు ఈ జిల్లాలో చోటు ఇవ్వకపోవడం బిసిలు జీర్ణించుకోలేకపోతున్నారు.

## కంచుకోటను కాపాడుకుంటాం

-సి.పి.ఎం.పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు..



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** ఎవరూ ఎన్నీ కుతంత్రాలు చేసినా పంచ తంత్రాలతో తిప్పికొడతామని సి.పి.ఎం.పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, హెచ్చరించారు.శుక్రవారం వరరామచంద్రాపురం, మండల పరిధిలోని కోటారు గొమ్ము ,గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుతంత్రాలను తిప్పి కొట్టి,కంచుకోటనుకాపాడుకుంటామని ఆయన అన్నారు. రాబోవుఈరెండునెలలు జాగ్రత్తగా ఉండాలని సూచించా రు.మన పార్టీ కార్యకర్తలు అంకుటిత పట్టుదలతో పార్టీ కార్యక్రమాలు ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని కోరారు. ప్రతీ ఒక్కరినీ కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది సూచించారు.మన హక్కుల సాధన కోసం గట్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రతీకార్యకర్త సైనికునిలా కష్టపడాలి దిశానిర్దేశం చేశారు. అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని,ఆదిశగా పార్టీ శ్రేణులు కదళాలని ఆయన కోరారు.ఈ ముఖ్య కార్యకర్తలు సమావేశంలో సీనియర్ నాయకులు పంకు సత్తిబాబు,వాళ్ళ కృష్ణారెడ్డి,కారం సుందయ్య, చీరపు తాతబాబురెడ్డి,కొండా రెడ్డి,సోడి మల్లయ్య, తదితరులు హాజరయ్యారు.

## పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని దూసరపాము గ్రామ శివారున కింద్ర రోడ్డు జంక్షన్ వద్ద శుక్రవారం ఎస్సై వెంకయ్య వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఏలేశ్వరం నుండి నర్సీపట్నం వైపు వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు గిఫ్ట్ అందజేస్తారని, అలానే ఇటీవల సతీస్ఘడ్ లో భారీ ఎన్కౌంటర్ జరిగిన అందువల్ల మావోయిస్టులు కదలికలు తెలుసుకోవడానికి, గంజాయి, నాటు సారాయి రవాణాను అరికట్టేందుకు పోలీస్ తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్థానిక సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఎస్సై వెంకయ్య, పి సి చందర్రావు, ఏ పి ఎస్ పి సిబ్బంది ఉన్నారు.

## ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శిరీష పర్యటన



**ఎటపాక, మేజర్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గం టీడీపి, బిజెపి, జనసేన పార్టీలు బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీష దేవి పరిచయ కార్యక్రమాన్ని ముంపు మండలాల్లో కిలారి వెంకటేశ్వరరావు అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ పరిచయ కార్యక్రమంలో భాగంగా జనసేన, బీజేపీ, టీడీపీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీష మర్యాదపూర్వకంగా కలిశారు. జనాసేన పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు మందా సుబ్రమణ్యం మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె కార్యకర్తలను ఉద్దేశించి అందరు సమన్వయంతో కలిసి ముందుకు సాగాలి అని, టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. అనంతరం టిడిపి నాయకులు పూసం రాఘవయ్య కుమారుడు వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, ముంపు మండలాల క్లస్టర్ ఇంచార్జి మాచినేని రాజేష్, మాజీ వైస్ ఎంపీపీ రావి మాధవరావు, నలజల శ్రీకాంత్, నెల్లిపాక సర్పంచ్ కోర్స భద్రమ్మ, మొల సతీష్, ఏలూరి వెంకన్న, రెడ్డి రామకృష్ణ, యర్రా మహేష్, మానికల వీర స్వామి, బోల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలు ఆకస్మిక తనిఖీ


-తహసీల్దార్ & ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సయ్యద్ మౌలానా ఫాజిల్



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** వరరామచంద్రాపురం, మండల కేంద్రంలోని 10వ తరగతి పరీక్షాకేంద్రాలను, తహసీల్దార్ &ఎగ్జిక్యూటివ్,మేజిస్ట్రేట్ సయ్యద్ మౌలానా ఫాజిల్,ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం"లెక్కల పరీక్షా"ఉండటంతో విద్యార్థినీ, విద్యార్థుల,వసతుల ఏర్పాట్లు యధావిధిగా ఉన్నాయా లేదా, నిర్వాహణ సక్రమంగా ఉందా లేదాని,పరిశీలించారు. వరరామచంద్రాపురం,జడ్పీ. హైస్కూల్, సున్నంవారిగూడెం, ఆశ్రమ పాఠశాలను,తనిఖీ చేసి పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినీ విద్యార్థులకు, ఏలాంటీ అసౌకర్యం, కలుగకుండా డ్రింకింగ్ వాటర్,తదితర విషయాల్లో ఆగడ్బందీ గా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు.సంతృప్తి వ్యక్తం చేశారు.పరీక్షా కేంద్రాలను పరిశీలించిన వారిలో రెవిన్యూ డిపార్ట్మెంట్ ఆర్.ఐ. రామకృష్ణ, ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయం చేసి కష్టపడి పంట పండిస్తే రేటు లేదాయే..

-తుఫాను వచ్చి తుడిచిపెట్టుకొనిపాయే..
-చేసిన అప్పులు తీర్చలేక రైతు బక్క చిక్కి పాయే..



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** ఎంతో కష్టపడి వ్యవసాయం చేస్తే, తుఫాన్ వచ్చి తుడిచిపెట్టుకొని పాయే..అప్పోచ ప్పోతెచ్చి పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తే చివరికి రేటు లేకపాయే,రైతులను రాజుగా మార్చే చట్టాలు రావాలి,కనీసం గిట్టుబాటు ధర అమ్ముకునే ధైర్యాన్ని రైతులకు కల్పించాలి ఈ ఏడాది వచ్చిన తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని సందర్భాల్లో రేటుఉన్నా దళారులరూపంలో ఇబ్బందులు తప్పడంలేదు.అసలు రైతుల కోసం ఎక్కడికక్కడ మార్కెటింగ్ గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. రైతులకు పండిన పంటను రేటు డిసైడ్ చేసేది,రైతే కావాలి. ఇవన్నీ ప్రభుత్వ ఆధీనంలో జరగాలి. దళారీ వ్యవస్థ పూర్తిగా, మటుమాయం కావాలి.రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలి. అప్పుడేరైతుతలెత్తుకుండేరోజువస్తుందిఆరోజు కోసం ఎదురుచుద్దాం.

## నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- రూ.1.28 కోట్లతో కార్యాచరణ
- కమిషనర్ జే.వెంకటరావు వెల్లడి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రానున్న వేసవిలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంచినీటి ఎద్దడి రాకుండా తీసుకోవలసిన చర్యలపై పురపరిపాలనాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో సమీక్షించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, సీడీఎంఏ తోపాటు పలువురు ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం నీటి ఎద్దడి నివారణకు తీసుకోవలసిన చర్యలపై కమిషనర్ ఇక్కడి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.28 కోట్ల వ్యయంతో నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణను రూపొందించామన్నారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, అద్దె ప్రాతిపదికన జనరేటర్ల ఏర్పాటు, మోటార్లు మరమ్మతులు సహా సుమారు 20 పనులకు సంబంధించి ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. కాకినాడ ప్రజలకు నీటిని సరఫరా చేసే వేసవి జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు ఎంత ఉన్నాయి? సమృద్ధిగా ఉన్నాయా? లేదా? వంటి అంశాలను కమిషనర్ ఆరా తీశారు. అలాగే ప్రజల అవసరాల మేరకు ఆయా ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోను ప్రజలు మంచినీటి ఎద్దడి ఎదుర్కోకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, డిఈ సుబ్బారావు, ఏఈలు ఎం.రమేష్‌బాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## గేట్-2024లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన సభ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలోని యుసిఇకె ఎలక్ట్రానిక్స్&కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) సెమినార్ హాలు నందు ది.22.03.2024 శుక్రవారం సాయంత్రం గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)-2024 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు గారు ముఖ్యఅతిథిగా విచ్చేయగా గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎంహెచ్‌ఎం.కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొ.యువి.రత్నకుమారి, ప్రొ.కె.మీరాసాహెబ్‌లు విచ్చేయగా ఈసిఈ విభాగాధిపతి డా.ఎల్.బి.లీలాకుమారి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ కృషి, పట్టుదలతో విద్యనభ్యసించినవారు ఉత్తమ ర్యాంకులు సాధించడంతోపాటు అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించగలరన్నారు. యుసిఇకెలోని విద్యార్థులు గేట్-2024 పరీక్షల్లో జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గేట్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 10వ ర్యాంకు సాధించిన వై.లక్ష్మీసాయి కృష్ణ, పి.జగదీశ్వరరావు (152వ ర్యాంకు), ఏవిఎస్-ఎస్.గౌతమ్ గుప్త (189), సత్యసాయి రెడ్డి (289), టి.ప్రశాంత్ (359), ఇ.శ్రీరామ్ (432), బి.సందీప్ సింగ్ (479)లనుఉపకులపతి ప్రత్యేకంగా అభినందించడంతో మెమెంటోలను బహూకరించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఈసిఈ విభాగంలో ర్యాంకులు సాధించిన మొత్తం 65మంది విద్యార్థులలో 2వేలు లోపు ర్యాంకులు సాధించిన వారిలో 22మంది ఉన్నారని, ర్యాంకులు సాధించిన అందరినీ ఉపకులపతి అభినందించారు. అనంతరం ఈసిఈ విభాగం ఆధ్వర్యంలో ప్రచురించిన ఈసిఈ ప్రిసేజ్ మ్యాగజైన్‌ను ఉపకులపతి ఆవిష్కరించారు. ఈసిఈ విభాగాధిపతి మరియు మ్యాగజైన్ ఎడిటర్ ఇన్ ఛీఫ్ డా.బి.లీలాకుమారి, స్టూడెంట్ ఎడిటర్స్ నవీన్, విఘ్నేష్, రమణి, అనూష, సుమాంజలి, సాత్విక, చందు, ధరణిలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, స్పెషల్ ఆఫీసర్‌లు, సీనియర్ ప్రొఫెసర్‌లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా స్టాలిన్ బాబు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా నేలపూడి స్టాలిన్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించడం పట్ల సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి, ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్, ఎంపీ మిథున్ రెడ్డి, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సతీష్ కుమార్, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యర్తలు, అభిమానుల అందరి సహకారంతో పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి చైతన్య పరుస్తానన్నారు. స్టాలిన్ బా.బు రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీగా నియమితులు కావడంతో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు.

## జగన్ హయాంలో మూతబడిన పరిశ్రమలను తెరిపించాలి

- యాజమాన్యాల లాభాపేక్షకు బలవుతున్న కార్మికుల భవిష్యత్



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడి వేలాది మంది కార్మికులకు ఉపాధి దూరమైందని, తక్షణం మూసివేసిన పరిశ్రమలను తెరిపించాలని సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వ శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్ డిమాండ్ చేశారు.

వివరాల్లోకి వెళితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బిక్కవోలు మండలంలో గాయత్రి బయో ఆర్గనిక్స్ స్టార్చ్ పరిశ్రమను గుజరాత్ కు చెందిన బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ప్రేవేట్ లిమిటెడ్ యాజమాన్యం 2018లో కొనుగోలు చేసి 5 ఏళ్ళు పూర్తికాకుండానే నేడు కుత్రిమంగా నష్టాలు చూపించి మూసివేతకు సిద్ధపడిందని విమర్శించారు. ముడి సరుకు లభించక లేఆఫ్ ప్రకటించాల్సి వచ్చిందని కార్మికులకు యాజమాన్యం చెప్పడాన్ని తప్పుబట్టారు. కేవలం పర్మినెంట్ కార్మికులను వదిలించుకుని, వేతన ఒప్పందాన్ని ఎగవేయడం కోసమే ఈ కృత్రిమ నష్టాలను చూపిస్తున్నారని తెలిపారు. ఈ పరిశ్రమపై ఆధారపడి 2002 సంవత్సరం నుండి 300 కుటుంబాలు, పరోక్షంగా మరొక 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఇప్పుడు మూసివేతతో ఉపాధిపోయి కార్మికుల కుటుంబాలు రోడ్డునపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో సామర్లకోట షుగర్ పరిశ్రమ మూతబడి ప్రత్యక్షంగా 2 వేల కుటుంబాలు, పరోక్షంగా వేలాది రైతుల కుటుంబాలు నష్టపోయిన విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక ప్రజాప్రతినిధులు కల్పించుకుని పరిశ్రమలు నడిచేందుకు ప్రయత్నించాలని కానీ జిల్లాలో అలాంటి ప్రయత్నాలు జగన్ హయాంలో జరగక పోవడం కార్మికులు చేసుకున్న దురదృష్టం అన్నారు. తక్షణం జిల్లా ఉన్నత అధికారులు బ్లూ క్రాఫ్ట్ యాజమాన్యంతో సంప్రదించి పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని లేని పక్షంలో ప్రభుత్వమే పరిశ్రమను నడపాలని డిమాండ్ చేశారు.

## చింతూరు కేంద్రంగా ఆధునిక పరికరాలతో లేబరేటరీ ప్రారంభం




**చింతూరు మేజర్ న్యూస్ :** ఆధునిక పరికరాలతో, చింతూరు మండల కేంద్రంలోని ఎర్రంపేటలో స్మార్ట్ లేబరేటరీ పేరుతో రక్త పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. చింతూరు ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండేలా లేబరేటరీని ఏర్పాటు చేశారు. వివిధ రకాల పరీక్షల కోసం ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే అందుబాటులో కి వివిధ పరీక్షలు తీసుకొని వచ్చారు. ఈ లేబరేటరీ లో హెల్త్ ప్రొఫైల్, డయాబెటిక్ హెల్త్ ప్రొఫైల్, కిడ్నీ ప్రొఫైల్, హార్ట్ ప్రొఫైల్, లివర్ ప్రొఫైల్, థైరాయిడ్ వంటి పరీక్షలు అందుబాటులోకి తీసుకొని వచ్చారు. పరిసర ప్రాంతాల ప్రజలు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వాహకులు డాక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 9.75 లక్షల నగదు స్వాధీనం



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ కార్ల తనిఖీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి అల్లవరం వైపుగా వస్తున్న కారులో 9.75 లక్షల నగదును అధికారులు గుర్తించారు. సరైన పత్రాలు చూపక పోవడంతో అధికారులు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎంపీడీవో కృష్ణమోహన్ బృందం జిల్లా ఉన్నత అధికారుల కమిటీకి అప్పగించారు. నగదు కు సంబంధించి పత్రాలు సంతృప్తికరంగా ఉంటే నగదు వెనక్కు అప్పగిస్తామని అధికారులు తెలిపారు.

# అవినీతి పాలనను అంతమొందించడమే లక్ష్యం

-కూటమి ఆత్మీయ సమావేశంలో నాయకుల పిలుపు

**సామర్లకోట,మేజర్న్యూస్ :** రాష్ట్రంలోఅవినీతిపాలననుఅంత మొందించడమే లక్ష్యంగా తెదేపా, జనసేన, బిజెపి కూటమి సమిష్టిగా కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, జనసేన పెద్దాపురం నియోజకవర్గం ఇంచార్జి తుమ్మల రామస్వామి (బాబు), బిజెపి నియోజకవర్గ ఇంచార్జివెంకట రమణలు అన్నారు. సామర్లకోట పూర్ణ కళ్యాణ మండపంలో గురువారం రాత్రి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఆత్మీయ సమావేశం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే చిన రాజప్ప, తుమ్మల బాబు, వెంకట రమణలతో పాటు ఆయా పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. తొలత ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడుతూ ఎలాంటి బేధం లేకుండా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలకు సమాన ప్రాధాన్యతను ఇస్తూ ముందుకు తీసుకెళ్ళనున్నట్టు హామీ ఇచ్చారు. గ్రామాలు, పట్టణాలన్నిటికీ అభివృద్ధి విషయంలో ఇతర విషయాల్లో సమాన ప్రాధాన్యత ఇవ్వనున్నందున కూటమి విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషిచెయ్యాలాన్నారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి రామస్వామి (బాబు) మాట్లాడుతూ ఎంతటి పెద్ద నాయకుడైనా కార్యకర్తల తరువాతే అయినందున



కార్యకర్తలే పార్టీకి ప్రాణం అన్నారు. ప్రస్తుతం వైసీపీ పాలనతో రాష్ట్రం రావణ కాష్టంగా మండుతుండగా రాష్ట్ర భవిష్యత్ ను కాపాడేందుకు తమ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగం, మహిళలపై దాడులు, హత్యలు వంటి ఇబ్బందులను అరికట్టేందుకు తెదేపా, బీజేపీ తో పొత్తు పెట్టుకున్నందున ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో వైసీపీ కి గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. దానికి గానూ ఎమ్మెల్యే ఓటును సైకిల్ గుర్తుపైనా, ఎంపీ ఓటు గాజుగ్లాసు గుర్తులపై ఓటేసిసిట్టింగ్ ఎమ్మెల్యే చిన రాజప్పకు ఘన విజయాన్ని అందించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇంకా సమావేశంలో బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ వెంకట రమణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూటమిగా ఏర్పడిన పార్టీల నాయకులంతా సమన్వయంతో పనిచేసి కూటమికి అఖండ విజయం చేకూర్చాలని పిలుపు నిచ్చారు. ఇంకా కార్యక్రమంలో బీజేపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నాయకులు సుంకవిల్లి బాపిరాజు, బీజేపీ నియోజక వర్గ మహిళా నాయకులు తుమ్మల పద్మజ, తెదేపా నాయకులు రాజా సూరిబాబు రాజు, అందుగుల జార్జి చక్రవర్తి, జెనసేన నాయకులు లక్ష్మన్ లు మాట్లాడగా మూడు పార్టీల నాయకులైన ఎమ్మెల్యే చిన రాజప్ప, జెనసేన ఇంచార్జి రామస్వామి, బీజేపీ కన్వీనర్ వెంకట రమణ లను పార్టీల నాయకులు మూడు పార్టీల కండువాలను వేసి, గజ మాలాలను వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు అడబాల కుమార స్వామి, తోటకూర శ్రీనివాస్, బడుగు శ్రీకాంత్, పాలకుర్తి శ్రీనుబాబు, కంటే జగదీశ్ మోహన్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, వల్లూరి దొర, కొత్తమ్ కోటి, ముత్యంరాజబాబు,డా.పసలసత్యానందరావు,పసల పద్మారాఘవ రావు, గొల్లపల్లి సర్వేశ్వర రావు, జెనసేన నాయకులు సరోజ వాసు, పిట్టా జానకి రామారావు, పెంకే వెంకట లక్ష్మి, మంచెం సాయి, బీజేపీ నాయకులు యార్లగడ్డ అక్కరాజు, ఇంకా నియోజకవర్గం పరిధిలోని ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

## జీతాలు ఇప్పించండి మహాప్రభో...

-సత్యసాయికార్మికులఆవేదన....

ఆర్థిక ఇబ్బందులతోసతమతమవుతున్న ఉద్యోగులు...

పట్టించుకోని కాంట్రాక్టర్లు..



దేవిపట్నం, మేజర్ న్యూస్ : మండలంలో సత్యసాయి తాగునీటి పథకంలో కాంటాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్టర్ సక్రమంగా కార్మికులకు జీతాలుచెల్లించక కుటుంబాలు పోషించుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవి కాలంలో అయినా జీతాలు అందక పోతే అర్ధాకలితో అష్టకష్టాలు పడాల్సి వస్తుందని కార్మికులు వాపోతున్నారు. ఒకపక్క భగ భగ మండే ఎండలతో భానుడు ప్రతాపం చూపిస్తుంటే త్రాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకూడదని అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న సిబ్బంది, వారికి జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారు.కాంట్రాక్టర్లు అధికారులు తమ వైపు చూడట్లేదని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సిపిడబ్ల్యు స్కీమ్ పురుషోత్తపట్నం పాత కాంట్రాక్టర్ 5 నెలలు, కొత్త కాంట్రాక్టర్ 5 నెలలు, కుట్రవాడ 20 నెలలు జీతాలు అందలేదు.అయినా ప్రజలకు త్రాగునీటి ఎద్దడి లేకుండా ఉండాలని జీతాలు లేక పోయిన ఇబ్బంది పడుతున్న,అప్పులు పుట్టక సతమతమవుతున్న త్రాగునీరు అందిస్తున్న కార్మికులను ఇటు అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోకుండా ఇప్పటివరకు ఇస్తామని చెబుతూ, ఇప్పుడు ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చింది ఇచ్చే పరిస్థితి లేదని చెప్పి చేతులెత్తేసారని, కార్మికులు వాపోయారు ఎండాకాలం వచ్చేసరికి తాగునీటి స్కీములు గుర్తుకొస్తున్నాయి దీనిపై ప్రభుత్వాలు పూర్తి దిష్టి పెట్టి తాత్కాలిక ఉపశమంతో కాకుండా శాశ్వత ప్రతిపాదనలు తీసుకువచ్చి కార్మికులను, అటు స్కీములను ఆదుకోవాలని, జీతాలు ఇప్పించి, ఆకలి బాద నుండి బయటపడేయాలి అని సిబ్బంది విన్నవించుకుంటున్నారు.


## కోతులు తరమడంతో విద్యార్థికి గాయాలు



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** కోతులు మూకుమ్మడిగా తరమడంతో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి గాయాల పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే గోపాలపురంలోని వాదాలకుంట రోడ్లో ఉన్న జామియా మసీద్ సమీపంలో తొమ్మిదో తరగతి చదువుతున్న సయ్యద్ అమన్ విద్య అనే విద్యార్థి నివాసం ఉంటున్నాడు. మొదటి అంతస్తులోకి మెట్ల వెంబడి వెళ్తుండగా సుమారు 10 కి పైగా ఉన్న కోతుల గుంపు ఒక్కసారిగా అమన్ పై దాడిచేయడానికి ప్రయత్నించాయి. దీంతో భయంతో పరుగులు తీయగా ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుండి అమన్ కింద పడిపోయాడు. దీంతో ఎడమ చెయ్యి విరిగిపోగా, వెన్నెముకకు బలమైన దెబ్బ తగిలింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రి తరలించి చికిత్స చేయించారు.

### రూరల్ నియోజక వర్గంలో సిఆర్పిఎఫ్ జవాన్లు మార్చ్ పాస్ట్

-జెండా ఊపి ప్రారంభించిన రూరల్ ఆర్వో తేజ్ భరత్



**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** ఓటర్లలో చైతన్యం తీసుకుని రావడం, స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించడం కోసం ఓటర్ల అవగాహన కల్పించడం జరుగుతోందనీ జిల్లా జాయింట్ కలెక్టర్, రూరల్ రిటర్నింగ్ అధికారి ఎన్. తేజ్ భరత్ పేర్కొన్నారు.

శుక్రవారం సాయంత్రం 2 వ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సైనిక కవాతు ప్రదర్శన జెండా ఊపి జేసి ప్రారంభించారు. టూ టౌన్ సిఐ వీ. శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు. ఈ మార్చ్ పాస్ట్ ఎన్టీఆర్ విగ్రహం, శ్రీనివాస హాస్పిటల్, ఎస్బిఐ ఇన్నీస్‌పేట, జోడుగుల్లు, విశ్వనాధ హాస్పిటల్, కాలేపల్లి స్వర్ణకారుడు వీధి, కుమారి థియేటర్ వెనుక వైపు, టి బార్, కెఆర్ ఫ్రూట్ జ్యూస్ సెంటర్, వరలక్ష్మి టెంపుల్ స్ట్రీట్, సప్పవారి వీధి, దుక్కల దొడ్డి, శివరామ ఫోటో స్టూడియో వద్ద కు చేరుకుని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల వద్ద ముగిసింది. మొత్తం దూరం 3 కి.మీ. మేర సైనిక కవాతు ప్రదర్శన నిర్వహించడం జరిగింది.

## ఘనంగా ప్రపంచ జల దినోత్సవం




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వి రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు విద్యార్థినిలను ఉద్దేశించి మాట్లాడుతూ మంచినీటి సామర్థ్యం గురించి వివరించారు శాంతిని సేకూర్చగలిగే శక్తి విధ్వంశాన్ని సృష్టించగలిగే సామర్థ్యం నీటికి ఉంటుందని నీటి కొరత లేకుండా నీటి కలుషితమైనప్పుడు లేదా ప్రజలు ప్రాప్యత కోసం పోరాడుతున్నప్పుడు సమాజంలో ఉద్రిక్తతలు తలెత్తుతాయని నీటి అవసరాలను సమన్వయం చేసుకోవడం ద్వారా శాంతి సాధ్యమన్నారు సుస్థిరమైన నీటి వినియోగం చుట్టూ ఐక్యం కావడం ద్వారా సమాజాలు దేశాల మధ్య సామరస్యాన్ని పెంపొందించాలని వివరించారు ఈ కార్యక్రమము జాతీయ సేవా పథకం అధికారులు శ్రీమతి సునీత డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ అనురాధ డాక్టర్ ప్రవీణ డాక్టర్ నిర్మల రవికుమార్ డాక్టర్ దక్షిణామూర్తి మరియు బోధ నేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండబాబు నివాసం వద్ద అభిమానుల సంబరాలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలుగు దేశం పార్టీ అధిష్టానం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తెలుగు దేశం , జనసేన, భాజాపా పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ఖరారు చేయడంతో కొండబాబు నివాసం వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసింది పోయింది. కొండబాబు అభినందనలు తెలపడానికి వచ్చిన వారితో జగన్నాథపురం చర్చ్ స్క్వేర్ సెంటర్ కోలాహలంగా మారింది. తీన్మార్ డప్పుల మోతతో, బాణాసంచా పేలుళ్ళతో దద్దరిల్లింది. ఈ సందర్భంగా కొండబాబు మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కాకినాడ సిటీ నుండి తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ ఉమ్మడి అభ్యర్థి గా పోటీ చేసే అవకాశం కల్పించిన నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, దగ్గుపాటి పురంధేశ్వరిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే భాద్యతలో భాగంగా ప్రధాన రాజకీయ పార్టీలు తెలుగుదేశం, జనసేన, భాజపా పొత్తులో తనకు ఈ అవకాశం కలగడం వెనుక తనపై ఉన్న నమ్మకమే కారణం అన్నారు. ఈ మూడు పార్టీల నాయకులు, క్యాడర్ ను కలగొలుపుకుని ప్రజల తరుపున పోటీ బరిలో దిగనునున్నట్లు కొండబాబు పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ వైఫల్యాలే ఉమ్మడి పార్టీల విజయానికి దోహదపడతాయన్నారు. ముఖ్యంగా కాకినాడ సిటీ లో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతి, అక్రమాలను, దురాగతాలను నిరోధించి ప్రజలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జీవించే విధంగా నగరానికి గత వైభవం తీసుకొచ్చే విధంగా ఉమ్మడి పార్టీల సంకీర్ణ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు అభిమానులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఎమ్మెల్యే అభ్యర్థి కొండబాబుకు పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి ఇన్చార్జిగా వర్మ



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వర్మ కు పిఠాపురం జనసేన, టిడిపి, బిజెపి ల ఉమ్మడి ఇంచార్జ్‌గా ఆ పార్టీల అధిష్టాన వర్గాలు నియమించాయి. దీనిపై పిఠాపురానికి జనసేన టిడిపి మధ్య చిక్కుముడి వీడినట్లే అయింది. ఏదేమైనా పిఠాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తంగేళ్ల ఉదయ శ్రీనివాసును కాకినాడ జనసేన పార్టీ ఎంపీ అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ ప్రకటించడంతో తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉమ్మడి పార్టీల ఇన్చార్జి పగ్గాలు వర్మ చేతికి రావటంతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌విఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆదేశాలకు కట్టుబడి పిఠాపురం నియోజకవర్గం నుండి జనసేన పార్టీకి తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇవ్వటం జరిగింది. అలాగే ఇంతకుముందు జనసేన పార్టీ ఇంచార్జ్ తంగేళ్ళ ఉదయ శ్రీనివాసు, టిడిపి నేత వర్మ మధ్య పచ్చగడ్డి వేస్తే భొగ్గు మనే విధంగా ఇద్దరు నేతలు పరస్పర విమర్శలు చేసుకున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ జోక్యంతో ఎస్‌విఎస్ఎన్ వర్మ ఇచ్చిన మాటకు కట్టుబడి పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కాకినాడ ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాసు గెలుపుకు తన పూర్తి సహకారం ఉంటుందని ఆయన తెలియపరిచారు. మొత్తానికి ఇరువురు నేతల మధ్య సఖ్యత సానుకూలంగా జనసేన పార్టీకి మారే అవకాశాలు పిఠాపురం కనిపిస్తున్నాయి.

## జనన-మరణ పత్రాల జారీపై త్వరలో కొత్త మార్గదర్శకాలు

- డిసిఓ అధికారుల బృందం వెల్లడి
- కాకినాడ కార్పొరేషన్‌లో సర్టిఫికెట్ల జారిపై పరిశీలన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి త్వరలోనే కొత్త మార్గదర్శకాలు విడుదల కానున్నాయని కేంద్రానికి చెందిన డిసిఓ అధికారుల బృందం వెల్లడించింది. హైదరాబాదులోని డైరెక్టర్ సెన్సెస్ ఆపరేషన్ (డిసిఓ) డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ పి.ఎల్.ఎన్.సి. శిశుకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రజ్ శుక్రవారం కాకినాడ నగరపాలక సంస్థలోని జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన విభాగాన్ని సందర్శించారు. ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వి చరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు చెందిన అధికారులు వీరితో సమావేశం అయ్యారు. జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి ప్రస్తుత అనుసరిస్తున్న మార్గదర్శకాలు ఏమిటి? వీటిని ప్రస్తుతం ఎలా జారీ చేస్తున్నారు? అన్ని నిబంధనలను అనుసరిస్తున్నారా? ఆన్‌లైన్ విధానాన్ని ఎలా ఫాలో అవుతున్నారు? రికార్డుల భద్రత ఎలా ఉంది? తదితర అంశాలను ఆరా తీశారు. రికార్డులను కూడా పరిశీలించి పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతి మరణ ధ్రువీకరణలోనూ మరణానికి గల కారణాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. జనన మరణాల సమాచారాన్ని అందించే సంబంధిత ఆసుపత్రి వర్గాలు, ఉద్యోగులకు తప్పనిసరిగా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జనన,మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి త్వరలోనే మరిన్ని కొత్త మార్గదర్శకాలు విడుదల కానున్నాయని వీటన్నింటినీ అధ్యయనం చేసి ఎటువంటి లోటుపాట్లు లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు.

## ఒట్టి గడ్డ నుండి
## ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నుండి ప్రచారం ముమ్మరం చేసేందుకు శుక్రవారం మండలంలోనివట్టిగడ్డ గ్రామం నుండి ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ భాస్కర్, ఎమ్మెల్యే ధనలక్ష్మిలు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గంలోని తూర్పు సెంటిమెంట్‌గా రాజవొమ్మంగి మండలంలో ఏదో ప్రాంతం నుండి ఎన్నికల ప్రచారం మొదలుపెట్టడం మొదటి నుండి అన్ని పార్టీలు ఆచరిస్తున్న విధానం. దీనిలో భాగంగా ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు వట్టి గడ్డ లోని గతంలో మాదిరిగా గుడిలో దర్శనం చేసుకుని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంత బాబు మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాగులపల్లి ధనలక్ష్మిని, అరకు పార్లమెంట్ వైసిపి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనూజ రాణిని2 ఫ్యాన్ గుర్తు పై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం నియోజకవర్గం లో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 2019లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధనలక్ష్మిని 40 వేల ఓట్ల అత్యధిక మెజార్టీతో గెలిపించి మీ అందరి ప్రేమాభిమానాలు చూపించడం జరిగిందన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలు కాలంలో శక్తి వంచన లేకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం అన్నారు. రాబోయే ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలుఅహర్నిశలు పనిచేసి గత ఎన్నికల్లో మెజార్టీ కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అనంత బాబు కోరారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### తాళ్లూరు జీయ్యన్నను దర్శించుకున్న జ్యోతుల నెహ్రూ



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం గండేపల్లి మండలం తాళ్లూరు లో ఘనంగా జియ్యన్న స్వామి తీర్థం జరిగింది. రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు ఆరోజు అనివార్య కారణాలవల్ల స్వామివారి దర్శనం చేసుకోకపోవడంతో శుక్రవారం సాయంత్రం స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ వేద పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ జీయ్యన్న స్వామివారి చల్లని ఆశీస్సులతో నియోజవర్గ రైతులు, ప్రజలందరూ, సుభిక్షంగా ఉండాలని కోరుకున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, సర్పంచ్ ఎస్. వీరబాబు, మాజీ సర్పంచ్ లు పాలచర్ల సత్యనారాయణ, పి. వెంకటేశ్వరరావు, దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, గ్రామ టిడిపి అధ్యక్షులు కోండ్రు అప్పలరాజు నాండ్ల చిరంజీవి, ముండ్రు శ్రీనివాసరావు, మలిరెడ్డి వెంకటరమణ, పి సూర్యనారాయణ తాళ్లూరు గ్రామ టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన తరగతులు

-రూరల్ నియోజక వర్గ ఆర్వో జేసి తేజ్ భరత్




రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ : రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ పై ఎన్నికల కమీషన్ నూతనంగా నిర్దేశించిన మార్గదర్శకాలు మేరకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, రాజమండ్రి రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఏన్.తేజ్ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ పై విద్యా శాఖ అధికారులకు, ప్రధానోపాధ్యాయులకి , ఇతర అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా రూరల్ ఆర్వో, జేసి తేజ్ భరత్ మాట్లాడుతూ , రానున్న సార్వత్రిక ఎన్నికలని సజావుగా , ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం అయ్యే అధికారులూ, సిబ్బంది, ఇతర విధుల్లో భాగస్వామ్యం అయ్యే వారికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కలుగ చేసేందుకు ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ల పై అందరూ పోలింగ్ అధికార్లకు పూర్తి గా అవగాహన వుండాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికీ శిక్షణ కార్యక్రమం సందర్భంలో వారి నుంచీ నిర్దుష్ట 12 డి ఫారం (అబ్సెంటి ఓటర్ వివరాలు ) ద్వారా అంగీకారం స్వీకరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం వోట్లను స్వీకరించిన తదుపరి ఆయా నియోజకవర్గాలకు పంపించడం జరుగుతుంది అని తెలిపినారు. ఫేసిలిటేషన్ కేంద్రం వద్ద డిక్ల రేషన్ ఫారం స్వీకరించడం అత్యంత ప్రాధాన్యత కూడినదిగా తెలియ చేశారు. తదుపరి హెడ్ మాస్టర్స్ ను వారి వారి టీచర్లకు ఎన్నికల మీద పూర్తి అవగాహన కల్పించడానికి సమావేశాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని తేజ్ భరత్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికార్లు మరియు తహశీల్దార్లు వై.కె.వి.అప్పారావు , బి.రమాదేవి, ప్రధానోపాధ్యాయులు , ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
శనివారం
23 మార్చి 2024


## టీడీపీలోకి పలువురు చేరిక



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పట్టణ పరిధి కోలా వారి వీదిలో పలువురు శుక్రవారం తెలుగుదేశం పార్టీ లోకి చేరారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ నేడు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు రాష్ట్ర అభివృద్ధి కేవలం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం బలపరిచిన ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీలో పలువురు చేరిక



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి ప్రసాద్ తెలుగుదేశం పార్టీ నుండి వైసిపి పార్టీ లోకి శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా సామర్లకోట పార్టీ క్యాంపు కార్యాలయంలో పెద్దాపురం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు న్యాయవాది ప్రసాద్ కు వైసీపీ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు, కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్, నాయకులు పుట్ట సూరిబాబు తదితరులు ఉన్నారు.

# ఎన్నికల విధులపై సమీక్షా సమావేశం

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాశుక్రవారం ఉదయం వెలగపూడి నుంచీ ఫారంలు ప్రగతి, పెండింగ్ స్థాయి, పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు, అనుమతులు, సివిజిల్ , ఈఏస్ఎమ్ఎస్, ఎఫ్ఎస్టి, తదితర బృందాలకు మేజిస్టీరియల్ అధికారాల అనుమతుల కోసం, కంట్రోల్ రూం ఏర్పాటు, సామాజిక మాధ్యమాల పై నిఘా, ఉద్రిక్తత నెలకొనకుండా చర్యలు పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా కె. మాధవీలత అధికారులకి సూచనలు చేస్తూ, ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపు వంటి అంశాలపై బూత్ స్థాయి అధికారి పై ఆధారపడకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించడం ద్వారా రిటర్నింగ్ అధికారి వ్యక్తిగతంగా నిర్ధారణ చేసుకోవడం చాలా అవసరం అన్నారు. ప్రతీ రోజు ఫారంలు పరిష్కారం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫారం -6కి సంబందించి సహేతుకమైన విధానం, ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుది ఓటరు జాబితా ప్రకటించిన తదుపరి ఫారం 7 కి చెందిన 15,185 దరఖాస్తులు రాగా వాటిలో 12,825 ఆమోదించడం జరిగిందనీ పేర్కొన్నారు. 2,360 పరిశీలన లో ఉన్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు తరపున, వ్యక్తిగతంగా ఎటువంటి ఎన్నికల ప్రచారం చేసిన వాటికి అనుమతులు తప్పనిసరి అని తెలియ చేశారు. సజావుగా ఎన్నికల విధులను నిర్వర్తించడం, ఓటర్ల ను ప్రలోభాలకు గురిచేసే విధానంలో నగదు, వస్తు పంపిణీ , తదితర వాటిపై దృష్టి పెట్టడం లో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య సమన్వయం సాధించాలన్నారు. అత్యంత ప్రాధాన్యతతో




విధులను నిర్వహించాలని, ఎప్పటికప్పుడు వాటి వివరాలు తగిన వీడియో రికార్డింగ్ చేస్తూ, వెంటనే సంభందిత నివేదికలు పంపాలన్నారు. నియోజక వర్గ స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు, సోషల్ మీడియా లో వచ్చే ప్రచార, అంశాలు తదితర వాటిపై పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హింసలకు, ఎటువంటి ఎన్నికల నియమాలు ఉల్లంఘన జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశం లో రూరల్ రిటర్నింగ్ అధికారి జేసి - ఎన్. తేజ్ భరత్, డి ఆర్వో జి. నరసింహులు , ఎస్‌డిసి - పార్లమెంటు ఏఆర్వోఆర్. కృష్ణా నాయక్, ఎమ్‌సిసి నోడల్ అధికారి, రుడా విసి బి. బాలస్వామి, ఎక్స్పెండేచర్ నోడల్ అధికారి జిల్లా ఆడిట్ అధికారి కే ఎన్. వేంకటేశ్వర రావు, ఎమ్‌సిసి సభ్యులు ఏడీ పరిశ్రమలు పి. ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

-బూరుగుపల్లి పిలుపు కందుల గెలుపు

-కందుల దుర్గేష్, బూరుగుపల్లి శేషారావు



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలంలో మార్చి 22వ తేదీ శుక్రవారం వెంకటరాయపురం, అజ్జరం పెరవలి, కొత్తపల్లి గ్రామాలలో జరిగిన కార్యకర్తల సమావేశంలో నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన , బిజెపి వుమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్, బూరుగుపల్లి శేషారావు లు జనసేన టీడీపీ కార్యకర్త లను ఉద్దేశించి ప్రసంగించారు. శేషారావు మాట్లడుతూ టీడీపీ , జనసేన నాయకులు కార్యకర్తలు సమష్టి గా కందుల దుర్గేష్ ని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. అదేవిధంగా జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీ బిజెపి పార్టీ ల వుమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ మాట్లడుతూ ఒక్క ఓటుతో ఇరువురి ఎమ్మెల్యేలను గెలిపించుకోవచ్చని తనను గెలిపిస్తే నిడదవోలు నియోజకవర్గం లోనే శాశ్వత నివాసం ఏర్పరచుకుని ప్రజలకు అందుబాటులో ఉంటానని అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో ఇరువురము కలిసి పాటుపడతామని పేర్కొన్నారు టీడీపీ నాయకులు పెరవలి మండల పరిధిలోని బలంగా ఉన్నారని , వారందరూ సమష్టి గా పనిచేసి తనను గెలిపించాలని కోరారు. శేషారావు సలహాలూ ,సూచనలతో పెరవలి మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో పెరవలి మండల టీడీపీ , జనసేన అధ్యక్షులు అధికాల శ్రీను,పిప్పర రవి టీడీపీ నాయకులు భూపతి రాజు రవివర్మ, సలాది కృష్ణమూర్తి, వాకలపూడి వీర్రాజు, నల్లాకుల వెంకటేశ్వరరావు కోటా శ్రీను మారిశెట్టి పోతురాజు దొరస్వామి బండారు సాయిబాబు కోపెల్ల చినబాబు సలాది శ్రీహరి, మానికిరెడ్డి కిట్టయ్య, పంపన మావుల్లు, జనసేన నాయకులు తులా చినబాబు, సౌజన్య,నాని, వెంకటేష్,నందిప శ్రీనివాస చక్రవర్తి రేలంగి రాజేష్ తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఈవీఎం, వీవీప్యాట్స్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

- జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా



**కాకినాడ, మేజర్ న్యూస్ :** లోక్ సభ, శాసనసభ -2024 ఎన్నికలకు సంబంధించి ఈసీఐ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో జిల్లా ఎన్నికలు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు.

కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా.. రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనీఖి చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు ఆరా తిసారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీప్యాట్స్ క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. సాధారణ ఎన్నికలు 2024 సంబంధించిన షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికలు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈవీఎం, వీవీప్యాట్ గోదాము భద్రతపై అప్రమత్తతో వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.డితిప్పే నాయక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, అగ్నిమాపక శాఖ అధికారి ఏసుబాబు, కాకినాడ పట్టణం తహసీల్దార్ కె.చెల్లన్న దోర, రాజకీయ పార్టీల ప్రతినిధులు జీ.సాయిబాబా (టీడీపీ), ఆర్.వెంకటేశ్వరరావు (వైసీపీ), కే.విజయరామయ్య (బీజేపీ), ఎస్.అప్పారావు (బీఎస్పీ), వాశంసెట్టి చంద్రరావు (సీపీఎం) కలెక్టరేట్ డీటీ ఎం.జగన్నాథం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రార్ ప్రొ.ఎల్. సుమలతకి సన్మానం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలోని యుసిఇకె ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) సెమినార్ హాలు నందు శుక్రవారం సాయంత్రం రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో టాప్ 100 గ్లోబల్ పవర్‌ఫుల్ ఉమెన్ అవార్డు సాధించిన రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత కి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికిఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా విచ్చేయగా గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొ.యువి.రత్నకుమారి, ప్రొ.కె.మీరాసాహెబ్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ అమెరికా కేంద్రంగా భారతదేశంలోని మెక్ స్టెమ్ ఎడ్యువర్సిటీ వారి రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో టాప్ 100 గ్లోబల్ పవర్‌ఫుల్ ఉమెన్ అవార్డుకు రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత ఎంపిక కావడం యూనివర్శిటీకే గర్వకారణమన్నారు. యూనివర్శిటీలో పరిశోధనల్లో మహిళా అధ్యాపకులను మరింత ప్రోత్సహించేందుకు ఈ అవార్డు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, సాంకేతిక సహకారం, యూనివర్శిటీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా ఈ అవార్డు లభించిందన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలతను ఉపకులపతితో పాటు టీచింగ్ & నాన్ టీచింగ్ సిబ్బంది సత్కరించగా రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో టాప్ 100 గ్లోబల్ పవర్‌ఫుల్ ఉమెన్ అవార్డు రావడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, స్పెషల్ ఆఫీసర్‌లు, సీనియర్ ప్రొఫెసర్‌లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అనపర్తి వారి పెళ్లిలో సందడి చేసిన కందుల బూరుగుపల్లి



**పెరవలి, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి** జిల్లా నిడదవోలు నియోజకవర్గ జనసేన తెదేపా బిజెపిల ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ ను నిడదవోలు నియోజకవర్గ తెదేపా శ్రేణులకు పరిచయం చేసేందుకు గత మూడు రోజులుగా నిడదవోలు మాజీ శాసనసభ్యులు నిడదవోలు నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి బూరుగుపల్లి శేషారావు నిడదవోలు నియోజకవర్గం మూడు మండలాల కు బూరుగుపల్లి పిలుపు కందుల గెలుపు అనే కార్యక్రమం చేపట్టి పరిచయ కార్యక్రమం చేస్తున్నారు. దానిలో భాగంగా మార్చి 22వ తేదీ శుక్రవారం పెరవలి మండలం లో పర్యటనకు విచ్చేశారు కానూరు గ్రామంలో అనపర్తి శివయ్య గారి కుమారుడు అనపర్తి పృద్వి వివాహా వేడుకలో వీరు ఇరువురు పాల్గొని పెళ్లికి విచ్చేసిన బంధుమిత్రులతో కలసి సందడి చేశారు. ఈ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న పెరవలి మండల దానికి సంబంధించిన బంధువులను శేషారావు రాజమండ్రి అర్బన్ రూరల్ ప్రాంతానికి చెందిన బంధుమిత్రులను దుర్గేష్ లు పాత పరిచయాలతో పేరుపేరునా పలకరించారు ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ పెరవలి మండలంలోని ప్రజలందరూ తనను ఆత్మబంధువు వలె చూస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు మాజీ శాసనసభ్యులు పురుగుపల్లి శేషారావు తణుకు మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ లు కూడా కానూరు అనపర్తి వారి అల్లుల్లె అని తెలుసుకుని వారిని అభినందించారు పెండ్లి కుమారుడు అనపర్తి పృద్వి మరియు వారి తల్లితండ్రులు అనపర్తి శివయ్య ఉషారాణి లను పెదనాన్న అనపర్తి శ్రీరామ్మూర్తి లను ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో వాకలపూడి వీర్రాజు ముళ్ళపూడి రాజేంద్రప్రసాద్ అనపర్తి సాంబమూర్తి జుజ్జవరపు వెంకటేశ్వరరావు వాకలపూడి సూర్యారావు పట్టికూటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వినియోగించుకుందాం...

-నీరు లేనిదే జీవకోటికి మనుగడ లేదు

-హోప్ రూరల్ రెస్పాన్సిబుల్ సొసైటీ అధ్యక్షులు జోజిబాబు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** నీరు లేనిదే జీవకోటికి మనుగడ లేదని, నీటిని పొదుపుగా వినియోగించుకుందామని, పర్యావరణం కలుషితం కాకుండా మన వంతు తోడ్పాటును అందించి సహజ వనరులను భావితరాలకు సహజంగా అందించాలని హోప్ రూరల్ రెస్పాన్సిబిలి సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ నల్లమిల్లి జోజిబాబు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని పిఠాపురం పట్టణంలో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ... నీటి యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ... ఆటో ద్వారా మైక్ అనౌన్స్మెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు జోజిబాబు మాట్లాడుతూ... నీరు సంపూర్ణంగా లభిస్తుందని విచ్చలవిడిగా వాడుతూ దుర్వినియోగం చేస్తే భవిష్యత్తు తరాలు నీటిని కన్నీళ్లలోనే చూడాల్సి వస్తుందని, గతంలో మన పూర్వీకులు చెరువుల్లో నీళ్లు తాగే వారిని తరువాత తరం బావులు, ఎప్పటి మన తరం బాటిల్ ద్వారా చూస్తున్నామని, ఇలాగే నీటిని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తూ పోతే భవిష్యత్తు తరాలు బాటిల్ మూతల్లో నీటిని చూసే పరిస్థితి వస్తుందని అన్నారు. మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని కాపాడుకుంటూ... వర్షపు నీటిని ఒడిసి పట్టి ఇంకుడు గుంతల ద్వారా ఆ నీటిని మళ్లించి భూగర్భ జలాలను పెంచాలని కోరారు. చెట్లను విరివిగా పెంచడం ద్వారా మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్, హోప్ రూరల్ రెస్పాన్సిబిలి సొసైటీ సంస్థ సభ్యులు నల్లమిల్లి పవన్ కుమార్, షేక్ రఫీ, రేకపల్లి వీర గణేష్, ఎస్.కె కరిముల్లా, నాయకులు రామకృష్ణ, రాజు, కన్నా, లిటిల్ సోల్జర్స్ కరుణ రాజు, చిన్న, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఉమ్మడి జిల్లాలో ఎరువులు, విత్తనములు మరియు పురుగుమందుల దుకాణలలో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని, ఎవ్వరైనా ఎరువులు, విత్తనములు మరియు పురుగుమందులను గరిష్ట అమ్మకపు ధర కన్న ఎక్కువ ధరకు అమ్మిన,నకిలీ విత్తనములు అమ్మిన సదరు దుకాణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె. ఎస్. ఎస్. వి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె. ఎస్. ఎస్. వి సుబ్బారెడ్డి ఆద్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులతో సంయుక్తముగా తూర్పు గోదావరి జిల్లాలలోని కడియం మండలములో ఆకస్మికముగా తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె. ఎస్. ఎస్. వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కడియం మండలం దుళ్ళ గ్రామములో శ్రీ వేంకటేశ్వర ఫెర్టిలైజర్స్ & పెస్టిసైడ్స్, అగ్రికల్చర్ ఇన్‌పుట్ అవుట్‌లెట్ ఎరువులకు సంభందించి డీలర్ స్టాక్ రిజిస్టర్ సక్రమముగా నిర్వహించకపోవుట, జారీచేసిన బిల్లులపై రైతుల సంతకములు తీసుకోకపోవుట, స్టాక్ బోర్డు అప్డేట్ చేయకపోవుట మొదలగు ఉల్లంఘనలకు గాను మండల వ్యవసాయ అధికారి, కడియం వారు సదరు షాపు యజమాని పై 6-ఏ క్రింద కేసు నమోదు చేసి సుమారు రూ 1,08,331/-లు విలువ గల 3.5 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేయడం జరిగింది అని పేర్కొన్నారు. పురుగు మందులకు సంబంధించి కూడా పై ఉల్లంఘనలకు గాను రూ 6,63,382/-విలువ గల 31.40 కేజీలు, 238.60 లీటర్ల పురుగు మందుల అమ్మకములను 21 రోజులపాటు నిలుపుదల చేయడం జరిగిందన్నారు . మూడు జిల్లాలలో ఎరువులు, విత్తనములు మరియు పురుగుమందుల దుకాణలలో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయి అని, ఎవ్వరైనా ఎరువులు, విత్తనములు మరియు పురుగుమందులను గరిష్ట అమ్మకపు ధర కన్న ఎక్కువ ధరకు అమ్మకము చేసిన, స్టాక్ రిజిస్టర్లు సక్రమముగా నిర్వహించకపోయిన, అక్రమ నిల్వలు వుంచిన, నకిలీ విత్తనములు అమ్మకములు చేసిన చేస్తే సదరు దుకాణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ తనిఖిలలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, భార్గవ మహేష్, కడియం మండల వ్యవసాయ అధికారి ద్వారకా దేవి పాల్గొన్నారు.

## పొగాకు బ్యారన్ దగ్ధం



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** దొండపూడి గ్రామంలో పొగాకు క్యురింగ్ అవుతున్న సమయంలో బ్యారన్ శుక్రవారం అగ్ని ప్రమాదానికి గురయ్యింది. దొండపూడి గ్రామానికి చెందిన మద్దాల స్వాతి, పెనుబోతుల నాగజ్యోతిమౌనికలకు చెందిన పొగాకు బ్యారన్ శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో మద్దాల స్వాతికి చెందిన బ్యారన్ పూర్తిగా కాలి బూడిదయింది. ఐదు లక్షల వరకు నష్టం ఉంటుందని అంచనావేస్తున్నారు. అదేవిధంగా పెనుబోతుల నాగ జ్యోతి మౌనిక కి చెందిన బ్యారన్ కూడా పక్కనే ఉండటం వల్ల మంటలు వ్యాపించి పాక్షికంగా పొగాకు కాలిపోయింది. నష్టం రెండు లక్షల వరకు ఉంటుందని కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

## ఆత్రేయపురం మండల పరిషత్ సమావేశం




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నార్కెడిమిల్లి ఎంపీటీసీ పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు ఆసరా పథకం బ్యాంక్ అకౌంట్‌లో జమ కావడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మెర్లపాలెం సర్పంచ్ మెర్ల రాము మాట్లాడుతూ మండల పరిధిలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కొందరు వాలంటీర్లు పార్టీ ప్రచారంలో నిమగ్నమయ్యారని, వాట్సప్ స్టేటస్ ల ద్వారా ఒక పార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారని, దాని నియంత్రించాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మెర్లపాలెం ఎంపిటిసి మెర్ల వీరబాబు మాట్లాడుతూ మెర్లపాలెం గ్రామంలో కోటి 20 లక్షల రూపాయలతో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించి ఏడాది అవుతున్నా ఇప్పటివరకు పనుల్లో పురోగతి లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మెర్లపాలెం గ్రామ శివారు బండారు కాలనీలో వాసంశెట్టివారి పాలెంలో తరచుగా త్రాగునీటి సమస్య ఏర్పడుతుంది అని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే సార్వత్రిక ఎన్నికల్లో నియమావళిని ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ వేతనాలను పొందే వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాటించాలని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. సమావేశంలో జడ్పిటిసి బోనం సాయిబాబా తదితరులు ఉన్నారు